క్లుప్తంగా

నెట్టికంటుడికి మహాభిషేకం



కుటుంబ సభ్యులతో కలిసి మహాభిషేకాన్ని వీక్షిస్తున్న వైవీఆర్ సతీమణి శారదమ్మ

గుంతకల్లు రూరల్: కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టింకటి ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మహాభిషేకం నిర్వహించారు. వైవీఆర్ సతీమణి శారదమ్మ ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకోగా ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వైవీఆర్ కుటుంబ సభ్యులు అందజేసిన అభిషేక ద్రవ్యాలతో అర్చకులు స్వామివారికి మహాభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను వారికి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

గుంతకల్లు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోను రాణించాలని డీఎస్పీ ఆముదాల శ్రీనివాస్ సూచించారు. ఇటీవల నంద్యాలలో నిర్వహించిన ఫస్ట్ ఇంటర్ జోన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో పట్టణంలోని భాష్యం హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. 70, 60 కేజీల విభాగంలో పదో తరగతి విద్యార్థులు కిషోర్ నాయక్, హాసన్‌లు ప్రథమ స్థానంలో నిలిచారు. 35, 30 కేజీల విభాగంలో ఆరో తరగతి విద్యార్థులు పవిత్ర, కావ్య మూడవ స్థానంలో నిలిచారు. బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం డీఎస్పీ తన చాంబర్‌లో విద్యార్థులను సత్కరించడంతోపాటు పీఈటీ మాధవి, కరాటే మాస్టర్ చరణ్‌ను అభినందించారు. కార్యక్రమంలో జెడ్‌ఈఓ రవివర్మ, ప్రిన్సిపాల్ జోత్స్న, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యువత దేశ ప్రగతికి పాటుపడాలి



జాతీయ వెబినార్‌ను నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: యువత సాంకేతిక విజ్ఞానాన్ని, నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకుని నూతన ఆవిష్కరణలతో దేశ ప్రగతికి పాటుపడాలని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు. సోమవారం కళాశాలలో ఐపీఆర్ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో కంట్రోల్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైన్స్ ప్రతినిధుల సౌజన్యంతో మేధో సంపత్తి హక్కులపై నిర్వహించిన జాతీయ సదస్సు విజయవంతమైంది. ఇలాంటి వెబినార్‌ల ద్వారా నైపుణ్యాల అభివృద్ధి, స్వీయ-విశ్వాసం పెంచడం, యువత తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవడానికి దోహదపడతాయన్నారు. ఈ వెబినార్‌లో వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి 300 మంది విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్ శర్మ, ప్రోగ్రాం కన్వీనర్ అల్తాఫ్, ఐక్యూఏసి కోఆర్డినేటర్ జమీలాబీ, అధ్యాపకులు రాఘవేంద్ర, రాజశేఖర్, బసవరాజు, శివశంకర్, శ్రీనివాసులు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లెదర్ పార్క్ పునః ప్రారంభించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

శింగనమల: మండలంలోని రాచేపల్లి వద్ద ఉన్న లెదర్ పార్క్‌ను పునః ప్రారంభించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ మాట్లాడుతూ రాచేపల్లి వద్ద లెదర్ పార్క్‌ను ప్రారంభించి, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్నారు. మండలంలోని రైతులందరికీ రైతు భరోసా కేంద్రాల్లో యూరియా సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లో జ్వరాలతో చాలామంది ఇబ్బంది పడుతున్నారని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, వైద్యం అందించాలని కోరారు. ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేంద్ర, వెంకటేసు, ఎర్రిస్వామి, రమణ, సుంకన్న పాల్గొన్నారు.

నత్తనడకన మరమ్మతులు!



సిమెంట్ రోడ్డు మరమ్మతుల దృశ్యం



మట్టి రోడ్డుపై వెళ్తున్న ఆటోలు, ద్విచక్ర వాహనాలు

- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- నిత్యం ప్రమాదాలతో వాహనదారుల అవస్థలు

తాడిపత్రి రూరల్: పట్టణ రైల్వే స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా ఏర్పాటు చేస్తున్న సిమెంట్ రోడ్ల పనులు నత్తనడకను తలపిస్తున్నాయి. పనుల ఆలస్యం ప్రయాణికులకు ప్రాణాంతకంగా మారుతున్నాయి. రైల్వే స్టేషన్‌కు వెళ్లే సిమెంట్ రోడ్డు తొలగించి కొత్త రోడ్డు వేసేందుకు పనులు జరుగుతున్నాయి. దీని కారణంగా తాత్కాలికంగా రోడ్డును మూసివేశారు. ఈ రోడ్డుకు బదులుగా పక్కనున్న మట్టిరోడ్డును ఆటోలు, ద్విచక్రవాహనదారులు ఉపయోగించుకుంటున్నారు. ఏడాది క్రితం రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. నెలలు గడుస్తున్నా పనులు పూర్తికాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మట్టిరోడ్డుపై ప్రయాణం ప్రయాణీకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. మోస్తరు వర్షం పడితే రోడ్డు చిత్తడిగా మారి ప్రమాదాలకు కారణమవుతోంది. ఇటీవల ద్విచక్రవాహనాలపై వచ్చే ప్రయాణికులు జారిపడి క్షతగాత్రులవుతున్నారు. రోడ్డుపై తడి ఉంటే చాలు వాహనాలు జారుతున్నాయి. గతంలో ఈ సమస్య ఉండటంతో మూసివేసిన సిమెంట్ రోడ్డును పునరుద్ధరించారు. వారం రోజులుగా నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభిస్తున్నామంటూ అధికారులు సిమెంట్ రోడ్డును మళ్లీ మూసివేశారు. దీంతో తప్పనిసరిగా వాహనదారులు మట్టిరోడ్డుపై వెళుతూ ప్రమాదాలబారిన పడుతున్నారు. మరోవైపు ఎండవస్తే తడిగా ఉన్న రోడ్డు ఎండిపోయి పెద్ద ఎత్తున దుమ్ము రేగుతోంది. ముందు వెళ్లే ఆటోల వల్ల రేగుతున్న దుమ్ముతో వెనుకల వచ్చే వాహనాదారులు సతమతమవుతున్నారు. వాన వస్తే వాహనాలు జారుతుండగా ఎండ వస్తే రేగుతున్న దుమ్ముతో ప్రయాణీకులకు శ్వాసకోశ ఇబ్బందులు పడుతున్నారు.



అత్తిరాలదిన్నె వద్ద కల్వర్టు నిర్మించి రోడ్డు వేయకపోవడంతో గుంతలమయమైన దృశ్యం

కల్వర్టు కట్టారు.. రోడ్డు మరిచారు!

పెద్దపప్పూరు: మండలంలోని అత్తిరాలదిన్నె నుంచి వేములపాడు వెళ్లే మార్గంలో కల్వర్టు నిర్మించి.. రోడ్డు వేయడం విస్మరించారు. దీంతో వర్షం పడిన తరుణంలో గుంతలమయమైన రోడ్డుపై కిందపడి ఎక్కడ కాళ్లు చేతులు విరుగొట్టుకోవాల్సి వస్తుందేమోనని వాహనదారులు భయాందోళన చెందాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల కురిసిన వర్షానికి అధిక లోడుతో భారీ వాహనాలు మట్టిరోడ్డుపై వెళ్లడంతో గుంతలమయంగా తయారైంది. కొందరు వాహనదారులు గుంతలమయమైన రోడ్డుపై ప్రమాదాలకు భయపడి అత్తిరాలదిన్నె నుంచి యాడికి మండలం నగరూరు మీదుగా యాడికి వెళ్లడం అలవాటుగా మార్చుకున్నారు. అధికారులు స్పందించి రోడ్డు వేయాలని వాహనదారులు వేడుకుంటున్నారు.

కనీస వసతులు కల్పించండి



అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు, ప్రజలు

గుంతకల్లుటౌన్: నిరుపేదలు నివసించే రామిరెడ్డి, జగ్జీవన్‌రామ్, భీమిరెడ్డి, హనుమాన్ టెంపుల్ కాలనీల్లో సీసీ రోడ్లతో పాటు కనీస వసతులను కల్పించాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. ఆయా కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడంలో మున్సిపల్ అధికారుల వైఖరిని నిరసిస్తూ సోమవారం ఆయా కాలనీలవాసులు ధర్నా నిర్వహించారు. వర్షం వస్తే మట్టి రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయని, దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నా అధికారులకు చీమకుట్టినట్లు లేకపోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథరెడ్డి, జిలాన్, సత్తార్, రామాంజి, ఆశాబీ, మాబున్నీ పాల్గొన్నారు.

శ్మశాన వాటికల్లో సౌకర్యాలు కల్పించండి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని హిందూ శ్మశాన వాటికల్లో పెరిగిన కంపచెట్లు తొలగించి వీధి దీపాలు, నీటి సౌకరం ఏర్పాటు చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీదేవిని సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, జగ్గిలి రమేష్ కోరారు. సోమవారం ఏసీని కలిసి వారు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు షాషా, తిమ్మప్ప, సూరి, ఉలిగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

తాడిపత్రి రూరల్: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం పట్ల ఉపాధ్యాయ, ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ జోనల్ కార్యదర్శి డేనియల్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో పెద్ద సంఖ్యలోఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రఘురామిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు దాటినా పెన్షన్‌పై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచినప్పుడల్లా డీఏను పెంచుతామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటి వరకు నాలుగు డీఏలను పెండింగ్ ఉంచిందన్నారు. అనంతరం తహసీల్దార్ సోమశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు జయచంద్ర, రాంకిషోర్, అంకాల్, అంజన్, రామాంజినేయులు, విష్ణు,రవిశంకర్, భాస్కర్‌రెడ్డి, ఉపేంద్ర,తారకమ్మ, వరలక్ష్మి,నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి నాగరాజు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మస్తాన్, లక్ష్మణ నాయుడు, సీనియర్ నాయకులు ఆదినారాయణ, రామచంద్ర తదితరులు స్పందన ఫంక్షన్ హాల్‌కు వెళ్లి ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవించారు. 12వ పీఆర్‌సీని వేయాలని, ఐర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ఇవ్వాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వాడుకోవద్దని కోరారు.

శైలజానాథ్ కోలుకోవాలని పూజలు



పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బుక్కరాయసముద్రం: వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి శైలజానాథ్ అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని మండల వైఎస్సార్ సీపీ నేతలు బాట సుంకలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శైలజానాథ్ 10 రోజులుగా వైరల్ ఫీవర్‌తో హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కాటమయ్య, నాగరాజు, నిమ్మల భాస్కర్, రాజారెడ్డి, వెంకటరామిరెడ్డి, సత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

‘విశ్వేశ్వరయ్య’ను ఆదర్శంగా తీసుకోవాలి



ఎస్‌ఆర్ఐటీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న అధ్యాపకులు



తాడిపత్రిలో విశ్రాంత ఇంజనీర్లను సత్కరిస్తున్న పెన్షనర్ల సంఘం సభ్యులు

బుక్కరాయసముద్రం/తాడిపత్రి టౌన్: ఇంజినీరింగ్ విద్యార్థులు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని ఏపీ ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) సురేంద్రరావు సూచించారు. బుక్కరాయసముద్రం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో భారత రత్న, ప్రముఖ ప్రజ్ఞాశాలి సివిల్ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా జాతీయ ఇంజనీర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధీర్రావు, ఐఐఐ అనంతపురం చైర్మన్ రామక్రిష్టారెడ్డి హాజరయ్యారు. ముందుగా కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం కళాశాలలో లైన్స్ ఇంజినీరింగ్ ఫొటోగ్రఫీ, ఫొటో, ఎలోక్యూషన్, వ్యాస రచన పోటీలు, విద్యార్థుల వినూత్న ఆవిష్కరణలతో మోడల్ ఎక్స్‌పో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, వైస్ ప్రిసిడెంట్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థుల పాల్గొన్నారు. అలాగే తాడిపత్రి పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని సోమవారం ట్రాన్స్‌కో అధికారులు ఆవిష్కరించారు. అనంతరం ట్రాన్స్‌కో అధికారులు శ్రీకృష్ణా వృద్ధాశ్రమంలో నిత్యవసర సరుకులు, మెడికల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్‌ఈలు సంపత్‌కుమార్, జేమ్స్ జయచంద్రారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మనాభపిళ్లై, డీఈఈలు ప్రభాకర్‌రావు, వసంతయ్య, ఏఈలు రాజారావు, పద్మనాభరెడ్డి, విజయుడు, నరసింహులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో రిటైర్డ్ ఇంజనీర్లు నరసింహులు, శివసుబ్రమణ్యంను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సత్యప్రసాద్‌రెడ్డి, హనుమంతరెడ్డి, ఆదినారాయణస్వామి, సూర్యనారాయణరెడ్డి, అశ్వత్థరెడ్డి, కుళ్లాయిరెడ్డి, శివసుబ్రమణ్యం, వెంకట్రామయ్య, రంగయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.ఆదేవిధంగా తాడిపత్రిలోని రోటరీ క్లబ్‌లో ఇంజనీర్స్ డే నిర్వహించారు. ఆ క్లబ్ ప్రసిడెంట్ కిషోర్ కుమార్ , వీరాస్వామి, నవీన్, బాలసుబ్రమణ్యం, రామసుబ్బారెడ్డి, షాకీర్,సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నగరూరు రైల్వేస్టేషన్‌లో ‘నాందేడ్ ఎక్స్‌ప్రెస్’ హాల్ట్

గుంతకల్లు: నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 18 నుంచి నగరూరు రైల్వేస్టేషన్‌లో నిలుపుదలకు (హాల్ట్) అనుమతులు ఇచ్చినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి బెంగుళూరు-నాందేడ్ (16593) ఎక్స్‌ప్రెస్ రైలు గుంతకల్లు-ఆదోని సెక్షన్‌లోని నగరూరు రైల్వేస్టేషన్‌కు ఉదయం 6.59కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 19వ తేదీ నుంచి ఈ రైలు (16594) రాత్రి 8.19కు చేరుతుందన్నారు. ఈ స్టేషన్‌లో ఈ రైళ్ల కేవలం ఒక్క నిమిషం మాత్రమే నిలుపుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

గుత్తి: పట్టణంలోని కర్నూల్ రోడ్డులో ఉన్న జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఇందూ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భాన్ని పురష్కరించుకుని సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఇందూను హెచ్‌ఎం సుంకన్న, పీడీలు షైరోజ, శ్యామల, లోకేశ్వరి , ఉపాధ్యాయులు అభినందించారు.

శింగనమల: మండలంలోని పెరవళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు స్విమింగ్ పోటీల్లో రాష్టస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం హరినాథ్, పీడీ నరసింహారెడ్డి తెలిపారు. అండర్-17 విభాగంలో బి.రాఘవేంద్ర, ఎస్.మోహన్ నాయక్, అడర్-19 విభాగంలో రాజ్‌పుల్లయ్య ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

గుత్తి: ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు ఏపీఎస్‌పీడీసీఎల్ కార్యాలయం ఆవరణలో నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. 1104 యూనియన్ సెక్రెటరీ నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు వైద్య ఖర్చులు భరించాలని, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు విన్సెంట్ కుమార్, సత్యనారాయణ, సాయి, రఫీ, సాయి ప్రకాష్, వెంకటేష, సూర్యనారాయణ, ఆంజనేయులు, హాజీ బాషా, కృష్ణ ప్రసాద్, హరిలాల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరులో ఉచిత వైద్యశిబిరం

యల్లనూరు: మండల కేంద్రంలోని కోటవీధి, బీసీ కాలనీ, కృష్ణాపురం, జంగంపల్లి, పాతపల్లి, వెన్నపూసపల్లి గ్రామాల్లో సోమవారం వైద్యులు శివసాయి ఆధ్వర్యంలో రోగులకు ప్రత్యేక చికిత్సలు అందించారు. ఇటీవల వర్షాలు పడిన నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా వైద్యాధికారి లోకేష్ ఆదేశాల మేరకు ఉచిత వైద్యాశిబిరాలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లోని జలుబు, దగ్గు, ఆయాసం, జ్వర పీడితులు 85 మందికి చికిత్సలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మధుకుమార్, సూపర్‌వైజర్లు హాజీవలి, జరినాభీ, ఎంఎల్‌హెచ్‌పీ శృతి, ఏఎన్‌ఎంలు సోమలత, ప్రమీల, స్నేహలత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేరం స్వర్ణలతకు పరామర్శ

యాడికి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేరం స్వర్ణలతను ఇటీవల హైదరాబాద్‌లో బ్రెయిన్ సంబంధిత వ్యాధికి శస్త్ర చికిత్స చేయించుకుని తాడిపత్రిలోని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న యాడికి ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, రమేష్ నాయుడు దంపతులు, యాడికి , పెద్దవడుగూరు మండలాల కన్వీనర్లు సంజీవరాయుడు, శరభారెడ్డి, భీమన పల్లి సర్పంచు రామచంద్రా రెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, కేశవ రెడ్డి తదితరులు సోమవారం ఆమెను పరామర్శించారు.

టపాకాయల విక్రయ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లు: రానున్న దీపావళి పండగ సందర్భంగా తాత్కాలిక టపాకాయల విక్రయాల దుకాణాల ఏర్పాటు లైసెన్స్ మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండల కేంద్రాల్లో తాత్కాలిక టపాకాయల విక్రయాల దుకాణాల ఏర్పాటు కోసం ఫారం ఏఈ-5, డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.పీఈఎస్ఓ.జీఓవీ.ఐఎన్ వైబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నివాస ధ్రువీకరణ ఆధారం, 5 పాస్ పొటోలతోపాటు హెడ్ ఆఫ్ అకౌంట్స్‌కు రూ.500 చలానా చెల్లించాలన్నారు. నాలుగు సెట్ల దరఖాస్తులను గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయంలో ఈ నెల 27 సాయంత్రం 5.00 గంటల్లోగా అందజేయవచ్చున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారుల విచారణ అనంతరం అర్హత బట్టి జీఎస్‌టీ, ఫైర్ చలానా, ఎన్‌ఓసీ అందజేసిన అనంతరం లైసెన్సులు మంజూరు చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు మండల సమావేశం

పుట్లూరు: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు.

ఇంటింటికీ స్మార్ట్ రైస్ కార్డులు

గుంతకల్లు రూరల్/యాడికి/పెద్దవడుగూరు: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన స్మార్ట్ రైస్ కార్డులను సోమవారం నుంచి ఇంటింటికీ అందజేయనున్నట్లు గుంతకల్లు తహసీల్దార్ రమాదేవి సోమవారం తెలిపారు. అలాగే యాడికి మండలంలోని పెద్ద పేటలో సోమవారం తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి రేషన్ కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసులు, ఆర్ఐ కిష్టప్ప , వీఆర్వోలు పాల్గొన్నారు. అదేవిధంగా పెద్దవడుగూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రేషన్ లబ్ధిదారులకు తహసీల్దార్ ఉషారాణి, ఎంపీడీఓ బారన్‌సాహెబ్, సర్పంచ్ వరలక్ష్మి స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు.

17 నుంచి ‘స్వస్థ నారీ’

పెద్దవడుగూరు/గార్లదిన్నె: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న స్వస్థ నారీ-శక్తివంతమైన కుటుంబం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెద్దవడుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పుష్పలత, సునీత సూచించారు. ఈ నెల 17న పెద్దవడుగూరులోని ఆస్పత్రిలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. మండలవాసులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే గార్లదిన్నెలో ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య సోమవారం మట్లాడుతూ తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం ద్వారా మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళల్లో గుండె జబ్బులు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌ను పరీక్షల ద్వారా గుర్తించి వైద్య చికిత్సలు అందిస్తామన్నారు.

హోరాహోరీగా ఖవ్వాలి పోటీలు

పామిడి: పట్టణంలోని పాదీఖానాలో హజరత్ సయ్యద్ ఖాదర్‌వలి బాబా మదనీ ఉరుసును పురస్కరించుకుని ఖవ్వాలి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖవ్వాలి పోటీలు హోరాహోరీగా సాగాయి. మంగళవారం జియారత్ కార్యక్రమంతో ఉరుసు మహోత్సవాలు ముగుస్తాయని కమిటీ సభ్యులు తెలిపారు.

రామకృష్ణ నాయక్ మృతిపై విచారణ చేయాలి’

శింగనమల: మండలంలోని నాగులగుడ్డం తండాకు చెందిన రామకృష్ణ నాయక్ మృతిపై విచారణ జరిపించాలని డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యుడు లోలూరు కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పేకాట ఆడుతున్నారన్న నెపంతో మానసికంగా ఇబ్బందికి గురి చేశారన్నారు. పోలీసులకు భయపడి రామకృష్ణ నాయక్ గుండెపోటుతో మృతి చెందారన్నారు. ఘటనపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గుర్రప్పస్వామి ఆలయంలో పూజలు

పుట్లూరు: మండలంలోని తక్కళ్లపల్లిలో గుర్రప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట చేపట్టి 41 రోజులు పూర్తి కావడంతో సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

విశేష అలంకరణలో బుగ్గ రామలింగేశ్వరుడు



తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీసమేత బుగ్గ రామలింగేశ్వర స్వామి సోమవారం విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు తెల్లవారుజామున స్వామి, అమ్మవారికి పంచామృతభిషేకాలు,కుంకుమార్చనలను నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేశారు.స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

ప్రమాద సూచికల ఏర్పాటు

పెద్దవడుగూరు: మండలంలోని మిడుతూరు, కాశేపల్లి, గుత్తిఅనంతపురం గ్రామాల సమపంలోని జాతీయ రహదారిపై ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది ప్రమాద సూచికలను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాహనాలను జాగ్రత్తగా నడపాలన్నారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రి రూరల్: మండలంలోని సజ్జలదిన్నె సమీపంలోని బెటాలియన్ వద్ద సోమవారం ఆరుగురు జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.14350ను స్వాధీనం చేసుకున్నామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. నిందితులు శ్రీనివాసులు, బాలకొండప్ప, సుదర్శన్, శివారెడ్డి, బాషా, నాగభూషణను అరెస్టు చేశామన్నారు.

పశువులకు టీకాలు

పెద్దవడుగూరు: మండలంలోని విరుపాపురం, ఆవులాంపల్లి, పెద్దవడుగూరు గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ గుత్తి సహాయ సంచాలకురాలు డాక్టర్ భారతి, పెద్దవడుగూరు పశు వైద్యాధికారి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

‘మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని ఇసురాళ్లపల్లికి చెందిన సావిత్రి అనే మహిళ సోమవారం ఆత్మహత్నాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సావిత్రి గత కొన్ని నెలలుగా కుటుంబ సమస్య, అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేది. తీవ్ర మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం సావిత్రిని వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేట్ సెలూన్ షాపులు తొలగించాలి



మాట్లాడుతున్న క్షౌ రవృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్: పట్టణంలో ఏర్పాటు చేసిన కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించే వరకూ ఈ నెల 17 నుంచి దశలవారీగా పోరాటాలు కొనసాగిస్తామని క్షౌ రవృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు తెలిపారు. సోమవారం సంఘం పట్టణ అధ్యక్షుడు బి.లక్ష్మినారాయణ అధ్యక్షతన గంగానగర్‌లోని రజక ఫంక్షన్ హాల్‌లో ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వాల్మీకి సంఘం పట్టణ కార్యదర్శి మాచర్ల ఎల్లప్ప, రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవేంద్రప్ప, కాటికాపరుల సంఘం రాష్ట్ర నాయకుడు జగ్గిలిరమేష్, సంచార జాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్వామిదాస్ పాల్గొని నాయీ బ్రాహ్మణుల పోరాటాలకు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో క్షౌ ర వృత్తిదారుల సంఘం కోశాధికారి బ్రహ్మ, నాయకులు బాలకృష్ణ, అజయ్, అంజి, విజయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.